





# ఎడతెరిపి లేని వర్షానికి గ్రామీణం అతలాకుతలం

- నివాసపు ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- ఇళ్లల్లోకి చేరిన వరద నీటిని ఎత్తిపోస్తున్న ప్రజలు
- గాలి వర్షాలకు అక్కడక్కడ విరిగిపడిన చెట్టు కొమ్మలు
- రోడ్లపై ప్రవాహంలా ప్రవహిస్తున్న వరద నీరు
- ప్రయాణికులు ప్రయాణానికి ఆటంకం

**వరంగల్ బ్యూరో, ఆగస్టు 31,(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ లో నమోదైన వర్షపాతానికి జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, కుంటలు వరద నీటితో పొంగిపోతున్నాయి. అక్కడక్కడ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రక్కన ఉన్న చెట్ల కొమ్మలు విరిగిపడి, వరద నీరు ప్రవాహంలో రోడ్లపై ప్రవహించడంతో ప్రయాణికులకు ప్రయాణం ఆటంకంగా మారింది. మండలాల వారీగా గ్రామీణ ప్రాంతాలలో గాలి వర్షాల కారణంగా కొన్ని నివాసపు ఇల్లు ధ్వంసం అయిపోయాయి. మరికొన్ని చోట్లలో చెట్ల కొమ్మలు నివాసప ఇళ్లపై పడడంతో బాధితులు మీ సహాయ స్థితిలో ఉన్నారు. వరంగల్, ఖమ్మం ప్రధాన రహదారిపై పలుచోట్లలో ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు గుంతలలో చేరి ప్రయాణికులను బాధిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు లెక్కలేనట్లుగా గుంతల ప్రాంతాలలో పడుతూ, లేస్తూ ప్రయాణికులు గాయాలతో వెళుతున్నారు. రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాల కారణంగా ఎవరిని నిందించాలో తెలియని స్థితిలో ప్రయాణికులు తలరాతగా భావిస్తున్నారు. మరి కొంతమంది తీవ్ర గాయాలపాలై ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. వర్షపాతం కారణంగా రోడ్డుపై ప్రయాణం చేస్తూ, ఎక్కడ ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందోనని ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్ల కొమ్మలు అడ్డగోలుగా విరిగి పడుతున్నాయి. ఎప్పుడు, ఎక్కడ ఎవరిపై పడి ప్రమాదం సంబవిస్తుందోనని ప్రయాణికులు బయపడుతున్నారు.

### చెన్నారావుపేట మండల పరిధిలో...

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా చెన్నారావుపేట మండల పరిధిలోని 30 గ్రామాలు సమస్యాత్మకంగా మారాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు భారీగా కురుస్తున్నాయి. కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. జల్లి గ్రామంలో ఈదురు గాలుల కారణంగా 10 నివాసపు ఇళ్లుల పై కప్పులు లేచిపోయాయి. బాధిత కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. పాపయ్యపేట, భోజెరువు గ్రామాలలో నీళ్లు ఇండ్లలోకి చేరింది. ఇక రోడ్ల పరిస్థితి మరింత చెప్పుకోలేని విధంగా అధ్వానంగా మారిపోయింది. గురిజాల లెవెల్ బ్రిడ్జి రోడ్డుపై నుండి నీరు ప్రవహిస్తూ, గురిజాల, నర్సంపేట రాకపోకల మధ్య అంతరాయం ఏర్పడింది. వర్ష బీభత్సం కొన్ని గ్రామాలలో రైతుల పంట పొలాలు జలమయంగా మారాయి. పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు నేలవాలాయి. రైతులు పెట్టుబడి పెట్టి వేసిన పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వర్షపాతం కారణంగా రైతులు వేసిన పంటలు, పై కప్పు లేచిపడి ఇళ్లులు కోల్పోయిన బాధితులు, రోడ్డు ప్రమాదాలకు గురయ్యే వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.







# ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

## - డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం



చెన్నారావుపేట, ఆగస్టు 31,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండలం జోజిపేట నారాయణ తండ శివారులో ఆర్టీసీ బస్సు ప్రమాదం నుంచి బయటపడ్డ ఘటన చోటు చేసుకుంది. శనివారం ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం ఎడతెరిపి లేకుండా కురిసిన గాలి, వర్షానికి రహదారిపై చెట్టు కొమ్మ విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో డ్రైవర్ బస్సును చెట్టు కొమ్మ ప్రక్కనుంచి తీసుకెళ్లే క్రమంలో కాస్త రోడ్డు దింపేసరికి ఒక్కసారిగా బస్సు దిగబడి, వన్ సైడ్ వంగిపోయింది. బోల్తా పడే ప్రమాదకర పరిస్థితిలో ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమై, చాకచక్యంగా బస్సును యదావిధిగా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం సంభవిస్తుందని భావించిన ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఊహించని ప్రమాదంలో చిక్కుకున్నామని భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. బస్సు బోల్తా పడకుండా జాగ్రత్తలు పాటించి, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా, ప్రాణాపాయ పరిస్థితి నుంచి పరిరక్షించిన డ్రైవర్ ని ప్రయాణికులు, స్థానికులు అభినందించారు.



సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై గూడ అరుణ్ జెసిబి మిషనరీ సహాయంతో రోడ్డుపై అడ్డుగా పడివున్న చెట్టు కొమ్మను తొలగించారు. అనంతరం రోడ్డు పక్కన దిగబడి ఉన్న ఆర్టీసీ బస్సును రొడ్డుపైకి లాగి సమస్యను పరిష్కరించారు.



# విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

## - పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





రాయపర్తి, ఆగస్టు 31,(జర్నలిస్ట్ వార్త): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య బోధన, తరగతి గదుల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారులను మందలించారు. సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం గురుకులాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాల, కళాశాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. రాజకీయాలకతీతంగా పాఠశాలను నడిపించాలని, ఉద్యోగులు అంతర్గత కలహాలను విడాలని అన్నారు. వారి వెంట గురుకుల ప్రిన్సిపల్ సరిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ఎండి ఉస్మాన్, ఎండి గౌస్ ఖాన్, ఎండి అఫ్రోజ్, గబ్బెట బాబు, గుగులోత్ యాకుబ్, మండల నాయకులు పాల్గొన్నారు.

